తెలంగాణ రాష్ట్ర అవతరణ
దశాబ్ది ఉత్సవాలు
2014 - 2023

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

తెలంగాణ రాష్ట్ర అవతరణ
దశాబ్ది ఉత్సవాలు
2014 - 2023

హైదరాబాద్ | శుక్రవారం 2-6-2023 | RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :29 | సంచిక: 228 | పేజీలు:6 | వెల: రూ.1/-



## ప్రగతి రతనాల వీణ

...పదేండ్ల నా తెలంగాణ

తెలంగాణ రాష్ట్ర అవతరణ
దశాబ్ది ఉత్సవాలు
2014 - 2023

అస్తిత్వం కోసం ఒక జాతి కన్న కల
అలుపెరుగని దశాబ్దాల పోరాటం
అవిశ్రాంత ఆకాంక్షలే ఆయుధం
ఫలితం స్వరాష్ట్ర సాకారం!

అభివృద్ధి కోసం నిరంతర ఆరాటం
సకల జనుల సంక్షేమ సమాహారం
వ్యవసాయ వేదం.. కష్ట జీవుల స్వేదం
ఫలితం తెలంగాణ పురోగమనం!



జమ్మిచెట్టు ఆకులంత
'బంగారం'.. తెలంగాణ!
సమ్మక్కకు నిలువెత్తు
'బంగారం'.. తెలంగాణ!
నికార్సైన ప్రేమల నిలువెత్తు
'బంగారం'.. తెలంగాణ!
ఇది కట్ల పువ్వు..
ఇది ఊట చెలిమె..
సంతోషం వాకిట్ల
పరుచుకున్న రంగురంగుల
సింగిడి తెలంగాణ!

పదేండ్లలో
వందేండ్ల
అభివృద్ధికి
బాట

### తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

జూన్ 2 నుంచి 22 దాకా..

హైదరాబాద్‌లోని గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించి
గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్‌రావు గారు ఈ వేడుకలను ప్రారంభిస్తారు. సచివాలయ ప్రాంగణంలో
జాతీయపతాకాన్ని ఆవిష్కరించి జాతికి సందేశం ఇస్తారు.

నున్నగ మెరుస్తున్న రోడ్డు పక్కన మోదుగుపూలు మెరుస్తున్నయి. ఊరి చెరువు నీళ్లల్ల కలువలు కాంతులీనుతున్నయి. చెక్‌డ్యామ్‌ల చేపలు ఎగిరెగిరి మురుస్తున్నయి. పొలంకాడి బోరుబాయి జోరుగ నీళ్లు పోస్తున్నది. పాలపిట్ట పరవశించిపోతుంటే.. పంటచేను పాల కంకులు కంటున్నది. ఎడ్ల బండ్లన్నీ వడ్ల బండ్లు అవుతున్నయ్. కట్ట మైసమ్మ ముందు కోడిని కోసి బోనమెత్తిన పాట.. నడిఊర్ల బతుకమ్మై ఆడుతున్నది. స్వరాష్ట్రం కోసం మహోద్యమమైన తెలంగాణ.. నేడు మహోజ్వలమై వెలుగుతున్నది.. సబ్బండవర్గాల సంక్షేమ సమాహారంగా సంబురం జరుపుకుంటున్నది.

**ఇది పదేండ్లల్ల పల్లెపల్లెనా రాశిబోసిన సంపతి!**
**ఇది ప్రతి ఇంటికీ చేరుకున్న సంక్షేమ ప్రగతి!**

జారీచేసిన వారు: స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ

# తంగేడు పువ్వులా ప్రగతితో వికసిస్తున్న తెలంగాణ

**(02 జూన్ 'తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల' సందర్భంగా)**

తెలంగాణ ప్రాంతం శాతవాహన, కాకతీయ, చాళుక్య, ముఘల్, కుతుబ్ షాహీ, అసఫ్ జారీల రాజవంశాలు పాలించాయని చరిత్ర చెబుతున్నది. 250 బిసిఈ - 200 సిఈ కాలంలో శాతవాహనులు కృష్ణ గోదావరి నదుల మధ్య ఉన్న ఈ ప్రాంతాన్ని ఏలడం జరిగింది. 950 సిఈ - 1323 సిఈ వరకు కాకతీయ రాజుల ఏలుబడిలో ఈ ప్రాంతం ఉండేది. 1323లో అల్లావుద్దీన్ ఖిల్జీ సైన్యం కాకతీయుల ప్రధాన కేంద్రమైన వరంగల్ కోటపై దాడి చేసి, కాకతీయులను ఓడించి, 1687 వరకు ఢిల్లీ సుల్తాన్‌ల ఏలుబడి సాగింది. 1712లో ఖుమారుద్దీన్ ఖాన్ దక్కన్ వైస్‌రాయ్‌గా నియమింపబడి, 'నిజామ్-ఉల్-ముల్క్' టైటిల్‌తో ముబారిజ్ ఖాన్‌ను ఓడించి దక్కన్ సభను ఏలడం ప్రారంభించారు. 1724 - 1948 వరకు అసఫ్ జాహీ రాజవంశస్థుల ఏలుబడులో పాలన జరిగింది.

## తెలంగాణ విమోచనం:

1769లో అసఫ్ జాహీ నిజామ్ వంశస్థులు హైదరాబాద్ కేంద్రంగా ఈ ప్రాంతాన్ని ఏలడం ప్రారంభించారు. 1799లో బ్రిటీష్ ప్రభుత్వంతో కలిసి పని చేయడంతో హైదరాబాద్ స్టేట్ విదేశాంగ, రక్షణ రంగాల్లో నిజామ్ అసఫ్ జాహీ-4 పట్టును కోల్పోయి, బ్రిటీష్ ఇండియాలో "ప్రిన్స్‌లీ స్టేట్"గా మారింది. 1947లో భారత స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ చొరవ తీసుకొని చివరి నిజామ్ ఒస్మాన్ అలీ ఖాన్‌తో మాట్లాడి ఇండియన్ యూనియన్‌లో చేరమని కోరగా పలు మార్లు తిరస్కరించారు. 17 సెప్టెంబర్ 1948న ఇండియన్ ఆర్మీ దాడితో ఒస్మాన్ అలీ లొంగిపోయి, నిజామ్ పాలన అంతమై హైదరాబాద్ రాష్ట్రం భారత్‌లో భాగమై, ఆ రోజు నుంచి ప్రతి ఏటా 'తెలంగాణ విమోచన లేదా విముక్తి దినం'గా పాటించుట జరుగుతున్నది.

## ఉమ్మడి రాష్ట్రంలో భంగపడ్డ తెలంగాణ:

1953లో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల పునర్ విభజన జరుగగా 01 నవంబర్ 1956న తెలుగు ప్రాంతాలు తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలు కలిసిపోయి ఆంధ్రప్రదేశ్‌గా ఆవిర్భవించడం జరిగింది. నాటి నుంచి ప్రారంభమైన ఆంధ్ర పాలకుల వివక్షాయుత నిర్ణయాలతో తెలంగాణ ప్రాంత అభివృద్ధి మందగించడమే కాకుండా నిధులు, నియామకాలు, నీళ్లు ఆంధ్ర ప్రాంతానికి వరదలా పారడంతో తెలంగాణ నేలలన్నీ బీడు భూములుగా, పేదలు నిరుపేదలుగా రూపాంతరం చెందడం జరిగింది. ఈ నేపథ్యంతో గత ఆరు దశాబ్దాలుగా తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం గళమెత్తిన, ఆంధ్ర పాలకులు అలక్ష్యం చేస్తూ అణిచి వేయడం జరుగుతూనే ఉండేది. మలి దశ ఉద్యమ వేడి తీవ్రత ఢిల్లీకి తాకడం, నాటి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సమ్మతించడం వెంట వెంటనే జరిగి పోయాయి.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం:

నాటి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 01 జూలై 2013న తీసుకున్న తీర్మానం ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అంగీకరించి, ఫిబ్రవరి 2014లో పార్లమెంట్‌లో రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రవేశ పెట్టడం జరిగింది. పలు దశాబ్దాల తెలంగాణ పౌర సమాజ పోరులో వందల, వేల ప్రాణాలు గాల్లో కలిశాయి. పార్లమెంట్ ఉభయ సభల్లో 'ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన చట్టం-2014' ద్వారా 02 జూన్ 2014న అధికారికంగా భారతదేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది.

## పది జిల్లాల తెలంగాణ:

తెలంగాణ ప్రజలు నీళ్ళు, నిధులు, నియామకాల్లో వివక్షను వ్యతిరేకిస్తూ తీవ్ర పోరాట పటిమ చూపుతూ, ప్రజా సంఘాలు, తెలంగాణ రాష్ట్ర సమితి ఉద్యమాల కారణంగా, నాటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని అంగీకరించి 10 జిల్లాలతో కూడిన నూతన రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 2014లో జరిగిన ఎన్నికల్లో 63 (119 సీట్లలో) సీట్లు గెలిచిన నాటి టిఆర్‌యస్ అధ్యక్షులు కె. చంద్రశేఖర్ రావు ప్రథమ ముఖ్యమంత్రిగా తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, 2019లో కూడా తిరిగి ఎన్నికై తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిడిపించే ముమ్మర ప్రయత్నాలను గత 9 ఏళ్లుగా చేస్తున్నారు. రాష్ట్ర వృక్షంగా జమ్మి చెట్టు, రాష్ట్ర పుష్పంగా తంగేడ పువ్వు, రాష్ట్ర జంతువుగా జింక, రాష్ట్ర పక్షిగా పాలపిట్టలను మన సంస్కృతిలో భాగంగా గుర్తించడం జరిగింది.

## సహజ వనరుల కేంద్రం తెలంగాణ:

త్రిలింగ దేశం పుణాదిగా ఏర్పడిన తెలంగాణ ప్రాంతానికి మూడు శివ క్షేత్రాలు కాళేశ్వరరం, శ్రీశైలం, ద్రాక్షారామం హద్దులుగా ఉండేవి. దక్షిణ-మధ్య భారతదేశంలో ఉత్తరాన మహారాష్ట్ర, ఈశాన్యాన ఒడిసా, ఛత్తీస్‌ఘడ్లు, దక్షిణ - ఆగ్నేయాన ఆంధ్రప్రదేశ్, పడమర దిక్కున కర్నాటకలు పొరుగు రాష్ట్రాలుగా తెలంగాణ నూతన రాష్ట్రం హైదరాబాద్ కేంద్రంగా ఏర్పడింది. సముద్ర మట్టానికి ఎత్తైన దక్కన్ పీఠ భూమిగా విస్తరించిన తెలంగాణ రాష్ట్రం గుండా గోదావరి, కృష్ణ అనబడే ముఖ్య జీవ నదులు ప్రవహిస్తున్నాయి.

## రైస్ బౌల్ ఆఫ్ సౌత్ ఇండియా:

తెలంగాణ భూభాగం ఎత్తున ఉన్నందున సహజ నీటి ప్రవాహంతో జలాలు వ్యవసాయానికి అందుబాటులో ఉండేవి కావు. దీనిని గమనించిన తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వర ఎత్తిపోతల పథకం లాంటి కొన్ని తాగు - సాగు పథకాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని కోటి ఎకరాలకు సాగు నీరు, ప్రజలకు ఇంటింటికీ తాగు నీరు ఇవ్వడానికి భగీరథ ప్రయత్నాలు వడివడిగా జరిగాయి. ఆంధ్ర పాలకుల కాలంలో నెర్రెలు బారిన బీళ్లు నేడు జల ప్రవాహాలతో పచ్చటి తివాచీలు పరిచినట్లు, అత్యధిక ఆహారధాన్యాలను ఉత్పత్తి చేస్తూ, 'రైస్ బౌల్ ఆఫ్ సౌత్ ఇండియా'గా రూపాంతరం చెందడం తెలంగాణ ప్రజలకు గర్వకారణంగా ఉన్నది. ఉత్తర దక్షిణ భారతానికి వారధిగా తెలంగాణలో విభిన్న సంస్కృతులు గల ప్రజలు సుఖశాంతులతో నిత్య నూతనంగా శోభిల్లుచున్నది. తెలుగు ప్రధాన భాషగా మాట్లాడే తెలంగాణలో హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠీ భాషలు మాట్లాడే ప్రజలు కూడా ఉన్నారు. తెలంగాణలో 40 శాతం పట్టణ జనాభా ఉండగా, 60 శాతం గ్రామీణ వ్యవసాయ ఆధారిత జీవనోపాధితో తెలంగాణ ప్రగతి పథంలో పరుగిడుతోంది.

## సుస్థిరాభివృద్ధి దిశగా తెలంగాణ:

హైదరాబాద్ మహానగరం దేశంలోనే ముఖ్యమైన నగరాల్లో ఒకటిగా 'దక్షిణ భారత కాపిటల్'గానే కాకుండా 20 ప్రపంచ మహానగరాల జాబితాలో 2వ స్థానంలో చోటు దక్కించుకొని పేరుగాంచింది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలు విడిదీయరాని అనుబంధాన్ని పెనవేసుకొని శాంతి భద్రతలు కలిగిన భాగ్యనగరంగా వర్ధిల్లుతున్నది. 3.98 కోట్ల జనాభా కలిగిన తెలంగాణలో హిందువులు అధిక శాతం ఉండగా, ప్రధాన మైనారిటీ జాబితాల ముస్లిమ్, సిక్కులు, క్రిస్టియన్లు కూడా ఉన్నారు.

## వ్యాక్సీన్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా:

ఐటి, ఫార్మారంగాలకు పుట్టినిల్లుగా, 'వ్యాక్సీన్ కాపిటల్ ఆఫ్ ఇండియా'గా, పారిశ్రామిక ప్రగతిలో అగ్రభాగాన తెలంగాణకే హైదరాబాదు గుండెకాయగా విస్తరిస్తున్నది. బతుకమ్మలో పేర్చిన సప్తవర్ణ పూలవలె తెలంగాణలో విభిన్న కులమతాల ప్రజలు అన్నదమ్ముల్లా కలిసిపోయి శాంతియుత సహజీవనం చేయడం సంతోషదాయకం. పంట రుణాల మాఫీ, సాగు నీటి ప్రాజెక్టులు, నిరంతర విద్యుత్ సరఫరా, రైతు బంధు, భూ రికార్డుల ప్రక్షాళన, ఐకెపి సెంటర్ల ద్వారా ధాన్యం కొనుగోలు, వృద్ధాప్య/వితంతు/కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ లాంటి ఆర్థిక చేయూతలను ఇచ్చే అనేక విలక్షణ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదరికాన్ని జయించే మహాయజ్ఞంలో తెలంగాణ ముందున్నది.

## సంక్షేమంతో పాటు సమగ్రాభివృద్ధి:

సంక్షేమ పథకాల అమలు మాత్రమే అభివృద్ధి కాదని, వీటితో ఒక రోజు ఆకలి తీరుతుందని గమనించాలి. రాష్ట్ర సుస్థిరాభివృద్ధి దిశగా నడిస్తే ప్రజలు ప్రతి రోజు సుఖసంతోషాలతో జీవించగలుగుతారనే విషయాలను పాలకులు గుర్తుంచుకోవాలి. ఓటు బ్యాంకు రాజకీయాలకు ఏ పార్టీలు, ప్రభుత్వాలు మినహాయింపు కాదు. నేడు అభివృద్ధి మరియు సంక్షేమ పథకాల మధ్య సమతుల్యత రావలసి ఉంది. తాత్కాలిక ప్రయోజనాలకు ప్రజలను అలవాటు చేయకుండా, దీర్ఘ కాలిక ప్రయోజనాలకు ప్రభుత్వాలు పట్టం కట్టాలి. గత 10 సంవత్సరాలుగా సాధించిన ప్రగతిని మననం చేసుకుంటూ, అసలైన సుస్థిరాభివృద్ధి పథకాలకు పుణాదులు వేసి తెలంగాణ రాష్ట్రాన్ని 'ఓనర్స్ ప్రైడ్ అండ్ నైబర్స్ ఎన్వీ'గా ఇతర రాష్ట్రాలకు ఈర్ష్యను కలిగించేలా, వడి వడిగా ముందడుగు వేయాలని కోరుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

---

# రాష్ట్ర క్రీడా చరిత్రలో ఇదో నూతన ఓరవడి

**-సాట్స్ ఛైర్మన్ ఆంజనేయ గౌడ్**

హైదరాబాద్ జూన్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు,



రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సీఎం కప్ - 2023 ముగింపు వేడుకలు నగరంలోని 6 స్టేడియాల్లో ఘనంగా నిర్వహించారు. ఎల్‌బి స్టేడియంలో సాట్స్ ఛైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ హాజరైనారు. సాట్స్ ఛైర్మన్ ఆంజనేయ గౌడ్ మాట్లాడుతూ, సీఎం కప్ నిర్వహణ ఘట్టం క్రీడా చరిత్రలో నిలిచిపోతుందని రాష్ట్ర క్రీడా చరిత్రలో ఇది ఒక నూతన ఓరవడి అని ఆయన అన్నారు. ఈ కప్ విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన ప్రతి ఒక్కరికి సాట్స్ తరపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. 618 మండలాలు, 33 జిల్లాలు రాష్ట్ర స్థాయిలో, 6 స్టేడియాలు 18 క్రీడాంశాల్లో జరిగిన ఈ పోటీలో ఎంతో మంది నిబద్ధతో చిత్త శుద్ధితో కృషి చేసిన మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని శాఖల అధికారులకు, సిబ్బంది, కోచ్‌లు, వ్యాయామ, ఉపాధ్యాయులకు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేసారు. క్రీడల్లో పాల్గొనే వారికి కష్టపడితే ఖచ్చితంగా ఫలితం వస్తుందని గుడి, బడి లాగే మైదాన్ కూడా పవిత్ర స్థలాలా జాబితాలో చేరిందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సాట్స్ ఓఎస్‌డి డా॥కె. లక్ష్మి, డిప్యూటి డైరెక్టర్లు శ్రీమతి సుజాత, ధనలక్ష్మి, చంద్రారెడ్డి, అనురాధ, ఓలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి జగదీష్ యాదవ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. సరూర్‌నగర్‌లోసరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన వాలీబాల్, కబడ్డీ, జిమ్నాస్టిక్స్ విభాగాల ముగింపు ఉత్సవాల్లో శాసన మండలి ఛైర్మన్ గుతా సుఖేందర్ రెడ్డి, సాట్స్ ఛైర్మన్ డాక్టర్ ఆంజనేయం గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరైనారు. వాలీబాల్, కబడ్డీ ఫైనల్ పోటీలను వారు తిలకించారు. విజేతలకు బహుమతులు అందజేసి, పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికేట్లు ప్రధానం చేసారు.

---

# ఆధార్ కార్డ్ ఉన్నవారందరికీ కీలక సమాచారం..

**-జూన్ 14 లోపు ఉచితంగా...**

హైదరాబాద్ జూన్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);బ్యాంకింగ్ సర్వీసుల నుంచి ప్రభుత్వ ప్రయోజనాల వరకు దేశవ్యాప్తంగా ఎలాంటి సేవలు పొందేందుకైనా ఆధార్ ఎంతో ముఖ్యమైనది. అందుకే.. కీలకమైన ఈ ధృవీకరణ పత్రాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచుకోవడం ఉత్తమం. ప్రతి పదేళ్లకోసారి ఆధార్ అప్‌డేషన్ తప్పనిసరని కేంద్ర ప్రభుత్వం కూడా నిబంధన అమల్లోకి తీసుకొచ్చింది. నిజానికి ఆధార్‌ను అప్‌డేట్) చేసుకోవడం ఏమంత కష్టమైన పనికాదు. భారతీయ పౌరులెవరైనా ఆన్‌లైన్‌లో ఈ సర్వీసును పొందొచ్చు.

అయితే సాధారణంగా ఆధార్ అప్‌డేషన్ ప్రక్రియకు ఫీజు రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. ఇక ఈ మాత్రం ఛార్జీ కూడా చెల్లించకుండా అప్‌డేట్ చేసుకునే ఆప్షన్ కూడా ఉంది. యుఐడీఏఐ అఫీషియల్ పోర్టల్‌పై ఈ ప్రక్రియను పూర్తి చేసుకుంటే ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం ఉండదు. అయితే జూన్ 14 వరకు మాత్రమే ఈ ఫీజు మినహాయింపు ఉంటుంది. అయితే డెమొగ్రాఫిక్ డేటా మాత్రమే అప్‌డేట్ చేసే అవకాశం ఉంది. అంటే పేరు, చిరునామా, పుట్టిన తేదీ, లింగం మొబైల్ నంబర్, ఈ-మెయిల్ వంటి వివరాలను మాత్రమే ఫీజు లేకుండా అప్‌డేట్ చేసుకునేందుకు వీలుంటుంది. ఫొటో, ఐరిస్ లేదా ఇతర బయోమెట్రిక్ వివరాలు మార్చుకోవాలనుకుంటే మాత్రం ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్‌ను సందర్శించి.. అవసరమైన ఫీజు చెల్లించి అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది.

### అసలు ఆధార్ వివరాలు ఎందుకు అప్‌డేట్ చెయ్యాలి..

ఆధార్ అప్‌డేషన్ ఎందుకంత ముఖ్యం?. ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకోవడం తప్పనిసరి చేస్తూ ఆధార్ పాలనా విభాగం యుఐడీఏఐ నిబంధనను అమల్లోకి తీసుకొచ్చింది. పిల్లల ఆధార్ వివరాల అప్‌డేషన్ కోసం ప్రభుత్వం కూడా కొన్ని నిబంధనలను అమలు పరుస్తోంది. పిల్లలకు 15 ఏళ్లు వచ్చేసరికి బయోమెట్రిక్ వివరాలన్నింటిని పొందుపరచాల్సి ఉంటుంది. మరి ఇంతలా ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకోవాలని ప్రభుత్వం ఎందుకు చెబుతోందంటే... ఆధార్ సంబంధిత సర్వీసులను మరింత మెరుగుపరచేందుకు వీలుంటుంది. మరోవైపు ఆధార్ అథెంటికేషన్ సక్సెస్ రేటు కూడా పెరుగుతుంది.

---

# మూడు రోజుల్లోనే రూ.50,000 కోట్ల విలువైన 2 వేల నోట్ల మార్పిడి

**-2000 రూపాయల నోటు మార్పిడిపై సుప్రీంకోర్టులో కీలక పరిణామం..**

న్యూఢిల్లీ జూన్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):: భారతీయ రిజర్వు బ్యాంక్, భారతీయ స్టేట్ బ్యాంక్ రూ.2,000 నోట్ల మార్పిడికి అనుసరిస్తున్న విధానాన్ని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో అపీలు దాఖలు చేసే ప్రయత్నం జరిగింది. ఎటువంటి గుర్తింపు పత్రాల అవసరం లేకుండానే ఈ నోట్లను మార్చుకోవడానికి అవకాశం కల్పించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఢిల్లీ హైకోర్టు మే 29న తోసిపుచ్చింది. దీనిపై పిటిషనర్ సర్వోన్నత న్యాయస్థానంలో అపీలు చేశారు. మూడు రోజుల్లోనే రూ.50,000 కోట్ల విలువైన నోట్లను మార్చుకున్నారని, బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చుకుంటున్నారని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. అయినప్పటికీ ఈ అపీలుపై అత్యవసర విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.పిటిషనర్ అశ్విని ఉపాధ్యాయ సుప్రీంకోర్టు లో ఈ అపీలును దాఖలు చేసేందుకు ప్రయత్నించారు. ఐడీ ప్రూఫ్ లేకుండా రూ.2000 నోట్లను మార్చుకోవడానికి అవకాశం కల్పించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. డ్రగ్ మాఫియాలు, హంతకులు తమ వద్దనున్న నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకుంటారని ఆరోపించారు. ఈ నోట్ల మార్పిడి లేదా జమ చేసేటపుడు బ్యాంకులు రిక్విజిషన్ స్లిప్ వంటివాటిని అడగటం లేదన్నారు. మూడు రోజుల్లో రూ.50 వేల కోట్ల రూపాయల విలువైన రూ.2000 నోట్లను మార్చేశారన్నారు. ఇలా జరగడం ప్రపంచంలో ఇదే మొదటిసారి అని చెప్పారు.సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధాంశు ధూలియా మాట్లాడుతూ, ఇలాంటి పిటిషన్లను సమ్మర్ వెకేషన్ సమయంలో తాము అనుమతించబోమన్నారు. వేసవి సెలవుల తర్వాత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం వద్ద మెన్షన్ చేయాలని తెలిపారు. పిటిషనర్ స్పందిస్తూ, అప్పటికి నల్లధనమంతా తెల్లధనంగా మారిపోతుందన్నారు. అయినప్పటికీ ఈ అపీలుపై విచారణకు సుప్రీంకోర్టు అంగీకరించలేదు. ఈ ధర్మాసనంలో జస్టిస్ కేవీ విశ్వనాథన్ కూడా ఉన్నారు.భారతీయ రిజర్వు బ్యాంకు (ఖీఃఎ) క్లీన్ నోట్ పాలసీలో భాగంగా రూ.2,000 నోట్లను చలామణి నుంచి ఉపసంహరించింది. సెప్టెంబరు 30నాటికి ఈ నోట్లను మార్చుకోవచ్చునని, లేదా, బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకోవచ్చునని చెప్పింది. మే 19న ఆర్బీఐ, మే 20న ఎస్‌బీఐ జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం రూ.2000 నోట్లను రిక్విజిషన్ స్లిప్స్ లేదా ఆధార్ కార్డు వంటివేవీ లేకుండానే మార్చుకోవచ్చు. ఇటువంటి నిబంధనల వల్ల చట్టవిరుద్ధ, అక్రమ సొమ్మును చట్టబద్ధమైన సొమ్ముగా మార్చుకుంటారని పిటిషనర్ అశ్విని కుమార్ ఉపాధ్యాయ ఆరోపించారు. అవినీతి నిరోధక చట్టం లక్ష్యాలకు విరుద్ధంగా ఈ మార్పిడి జరుగుతుందన్నారు. నిష్కళంక, పారదర్శక పాలన లేనిదే భారత దేశం అభివృద్ధి చెందదని చెప్పారు. దీని కోసం అవినీతి రహిత సమాజం ప్రాథమిక అవసరమని తెలిపారు. భారత రాజ్యాంగంలోని అధికరణ 21 ప్రకారం జీవించే హక్కుకు హామీ ఉందన్నారు. రాజ్యాంగ ప్రవేశిక సువర్ణ లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. నల్లధనం ఉత్పత్తి, బినామీ లావాదేవీలు, ఆదాయానికి మించిన ఆస్తులు వంటివాటిని నిర్మూలించకపోతే జీవించే హక్కు ఆచరణలో అమలు కాదని తెలిపారు. కాబట్టి బ్లాక్ మనీ హోల్డర్స్‌ను గుర్తించవలసిన బాధ్యత ఆర్బీఐకి ఉందన్నారు. వారు తమ నల్లధనాన్ని చట్టబద్ధమైన ధనంగా మార్చుకునే అవకాశాలను కల్పించవద్దని కోరారు. ఆర్బీఐ, ఎస్‌బీఐ నోటిఫికేషన్లను మదింపు చేయడంలో ఢిల్లీ హైకోర్టు విఫలమైందన్నారు.

---

# నాగార్జున సాగర్ పర్యాటకుల కోసం తెలంగాణ టూరిజం ప్రత్యేక ప్యాకేజీ

హైదరాబాద్ జూన్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఈ వీకెండ్‌లో హైదరాబాద్ నుంచి నాగార్జున సాగర్ వెళ్లాలనుకునే పర్యాటకుల కోసం తెలంగాణ టూరిజం ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది. హైదరాబాద్ నుంచి నాగార్జున సాగర్‌కు ఒక రోజు టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు పూర్తి వివరాలను ప్రకటించింది. తెలంగాణ టూరిజం అధికారిక వెబ్‌సైట్ లో ఈ టూర్ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి వివరాలు ఉన్నాయి.

నాగార్జున సాగర్ టూర్ (పేరుతో తెలంగాణ టూరిజం ఈ టూర్ ప్యాకేజీని అందిస్తోండగా.. ప్రతి శనివారం, ఆదివారం ఈ ప్యాకేజీని బుక్ చేసుకోవచ్చు. ఈ టూర్ ప్యాకేజీలో నాగార్జున సాగర్ డ్యామ్ (బోటింగ్ మ్యూజియం నాగార్జునకొండ బుద్ధవనం ప్రాజెక్ట్ తదితర పర్యాటక ప్రాంతాలు సందర్శించవచ్చు.

సాగర్ టూర్ ప్రయాణం సాగుతుంది ఇలా

ప్రతి శనివారం, ఆదివారం ఉదయం 7 గంటలకు హైదరాబాద్ పర్యాటక భవన్ నుండి, 8 గంటలకు బషీర్ బాగ్ నుండి నాగార్జునసాగర్‌కు బస్సు బయలుదేరుతుంది. ఉదయం 11:30 గంటలకి నాగార్జున సాగర్‌కు చేరుకుంటారు. ఉదయం 11:40 గంటలకు బుద్ధవనం ప్రాజెక్ట్ సందర్శన.. తర్వాత లంచ్ బ్రేక్ ఉంటుంది. అనంతరం నాగార్జునకొండకు లాంచీలో ప్రయాణం ఉంటుంది. అక్కడ నాగార్జున సాగర్ మ్యూజియం, నాగార్జునకొండ సందర్శిస్తారు. సాయంత్రం 4 గంటలకు నాగార్జున సాగర్ డ్యామ్ సందర్శన ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు నాగార్జున సాగర్ నుంచి తిరుగు ప్రయాణం మొదలవుతుంది. రాత్రి 9 గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు. దీంతో టూర్ ముగుస్తుంది.

హైదరాబాద్ టూ నాగార్జున సాగర్ టూర్ ప్యాకేజీ ధర

(నాన్ ఏసీ బస్సు) పెద్దలకు రూ.800, పిల్లలు (5 నుంచి 12సంవత్సరాలు) రూ.640 చెల్లించాల్సి ఉంటుంది. ఇక టూర్ ప్యాకేజీ లో బుద్ధవనం ప్రాజెక్ట్, నాగార్జున సాగర్ మ్యూజియం, నాగార్జునకొండ, నాగార్జున సాగర్ డ్యామ్, కవర్ అవుతాయి. ఆహారం, ఇతర ఖర్చులు పర్యాటకులే భరించాలి.

---

# ఆడబిడ్డలకు వరం కళ్యాణ లక్ష్మి పథకం..

**జడ్పీ చైర్పర్సన్ దపెదార్ శోభ**

నిజామాబాద్, జూన్1:ఆడపిల్లలు కలిగిన తల్లిదండ్రులకు సీఎం కెసిఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి పథకం దేవుడిచ్చిన వరమని జిల్లా పరిషత్ చైర్పర్సన్ దపెదార్ శోభ అన్నారు. మండలంలోని మహమ్మద్ గ్రామంలో మహమ్మద్ నగర్, బూర్గుల్ గ్రామాలతో పాటు 30 మంది లబ్ధిదారులకు కళ్యాణి లక్ష్మి చెక్కులను జడ్పీ చైర్పర్సన్ శోభ టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దపెదార్ రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గునుకుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, బిఆర్ఎస్ నాయకులు చింత కింది కాశయ్య, రామా గౌడ్, అఫ్జల్, జీవన్, మహేందర్, ఇఫ్తాకర్ దౌర నరేష్ పటేల్, పంచాయతీ కార్యదర్శి హరీష్ తదితరులున్నారు.

---

# బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ రావు



హైదరాబాద్ జూన్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);జాతీయ బిసి సంక్షేమ సంఘం తెలంగాణా రాష్ట్ర ప్రదాన కార్యదర్శిగా తుమరాడ శ్రీనివాస్ రావు నియమితులైనారు.ఈ మేరకు జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అద్యక్షులు ఆర్.కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్బంగా కృష్ణయ్య మాట్లాడుతూ పార్లమెంటులో బి.సి. బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని. బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లను రిజర్వేషన్లు కల్పించాలి. ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని, కేంద్ర విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు బి.సి.ల జనాభా ప్రసాదం 27శాతం నుండి 56 శాతంకు పెంచాలని కోరారు. రాజ్యాంగాన్ని సవరించి చట్ట సభలలో 50 శాతం సీట్లు అదనంగా పెంచి అత్యంత వెనుకబడిన కులాలకు నామినేటెడ్ పద్ధతిలో ఈ సీట్లు ఇవ్వాలి. విదేశీయులైన ఆంగ్లో-ఇండియన్లుకు నామినేటెడ్ యం.యల్.ఏ లూగా, యం.పి.లుగా ఇస్తున్నారు. కాని ఈ దేశంలో పుట్టిన అత్యంత వెనుకబడిన కులాలకు ఇవ్వడం లేదు. అందుకే అత్యంత వెనుకబడిన కులాలకు ఇంతవరకు అసెంబ్లీకి పార్లమెంటు కడప తొక్కని కులాలకు ఆంగ్లో ?ఇండియన్ల మాదిరిగా నామినేటెడ్ యం.యల్.ఏ / యం.పి లు ఇవ్వాలని కోరారు. శ్రీనివాస్ రావు ఆల్ ఇండియా తూర్పు కాపు సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రదాన కార్యదర్శిగా కొనసాగుతూ తూర్పు కాపు సంక్షేమం కోసం కృషి చేస్తూ తనకంటూ గుర్తింపు పొందారు.అతని సేవలను గుర్తించిన ఆర్. కృష్ణయ్య బిసి వర్గాలకు చెందినా 139 కులాలకు సేవలందించాలని కృష్ణయ్య కోరారు.అనంతరం శ్రీనివాస్ రావు మాట్లాడుతూ తనపై గల నమ్మకం తో తనకు ఈ పదవిని కేటాయించిన ఆర్. కృష్ణయ్య కు కృతజ్ఞతలు తెలిపారు.బిసి ల హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు.

---

# నూతన వస్త్రాలు బహుకరించి ఆశీస్సులు అందజేసిన ఎంపీ రవిచంద్ర

ఖమ్మం, జూన్1: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం ముస్తాఫానగర్ నివాసి కళాంగి ప్రకాష్ రావు-పుష్పల కుమార్తె ప్రసూన పెళ్లి జెస్సీ శామ్యూల్ రాజుతో ఈనెల 2వ తేదీన శుక్రవారం హన్మకొండలో జరుగుతుంది.ఈ సందర్భంగా ప్రసూనను పెళ్లి కూతురును చేయగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆమెకు నూతన వస్త్రాలు బహుకరించి, అంక్షింతలు వేసి ఆశీర్వదించారు.ఎంపీ రవిచంద్రతో పాటు మున్నూరుకాపు కాపు ప్రముఖులు పారా నాగేశ్వరరావు, ఆకుతోట ఆదినారాయణలు ప్రసూనకు తమ ఆశీస్సులు అందజేశారు.

---

# శ్రీ వేణుగోపాలస్వామి అలంకారంలో శ్రీనివాసుడు

తిరుపతి, జూన్ 1:శ్రీ వేణుగోపాలస్వామి అలంకారంలో చిన్న శేషవాహనంపై దర్శనమిచ్చారు శ్రీనివాసుడు. తిరుపతిలోని అప్పలాయ గుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్వామివారిని ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. చిన్నశేష వాహనం దర్శనమివ్వడం పాంచభౌతిక ప్రకృతికి సంకేతమని, ఈ వాహనం పంచభూతాత్మకమైన విశ్వానికి, అందులో నివసించే జీవునికి వరాలిస్తుందని అర్చకులు వెల్లడించారు. పంచశిరస్సుల చిన్నశేషుని దర్శనం మహాశ్రేయస్కరమన్నారు. అదేవిధంగా నారాయణవనం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ మురళీ కృష్ణుడి అలంకారంలో చిన్నశేష వాహనంపై దర్శనమిచ్చారు.

---

# ఆర్టీసి అధికారులతో మంత్రి పువ్వాడ సమీక్ష..



ఖమ్మం, జూన్1: (నేటినిజం ప్రతినిధి): డా.బిఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శాఖ పేషి నందు ఆర్టీసీ అధికారులతో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సమీక్షించారు. రవాణా వేసులుబాటు, నూతన బస్సులు, డబుల్ డెక్కర్ బస్సులు, ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ, సంస్థకు వచ్చిన లాభాలు, వ్యయం, సంస్థలో చేపట్టిన పలు కార్యాచరణలు, బస్సుల ఓ.ఆర్, ఉద్యోగుల సంక్షేమం, అందిస్తున్న వైద్య సేవలు తదితర అంశాలపై సంస్థ ఎండి సజ్జనార్ అధ్వర్యంలో సమీక్షించారు.

